ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేలా..

- ఐటీ కారిడార్ కూడళ్లపై అధికారుల ప్రత్యేక దృష్టి
- ప్రత్యామ్నాయ మార్గాలపై సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల అధ్యయనం
- ప్రత్యేక రూట్‌మ్యాప్‌లతో సమస్యను పరిష్కరించే యత్నం
- త్వరలోనే కార్యరూపం దాల్చే అవకాశం



హైదరాబాద్ సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగరంలో అత్యధిక సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా ఐటీ కారిడార్ మారింది. కేవలం ఐటీ రంగంలోనే సుమారు 9.5 లక్షల మంది వెస్ట్ హైదరాబాద్ పరిధిలోని ఐటీ కారిడార్‌లో పనిచేస్తున్నారు. దీంతో నగరం నలుమూలల నుంచి ఉద్యోగులు మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, నానక్‌రామ్‌గూడ, కోకాపేట, పుప్పాల్‌గూడ వంటి ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లోనే కాకుండా ఇతర సమయాల్లోనూ రోడ్లపై రద్దీ అధికంగా ఉంటోంది. ఆ ప్రాంతాల్లో ఐటీ కంపెనీల కార్యకలాపాలే కాకుండా భవన నిర్మాణ రంగానికి సంబంధించిన పనులు భారీ ఎత్తున జరుగుతుండడంతో ఆ రంగాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు నగరం నలుమూలల నుంచి ఇక్కడికి వస్తుంటారు. దీంతో నగరంలో ఎక్కడా లేనివిధంగా ఐటీ కారిడార్ పరిధిలో ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయి. కొత్తగా ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, లింకు రోడ్లు నిర్మించినా ప్రధాన రహదారులు, కూడళ్లపై రద్దీ పెరుగుతోందే తప్ప తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో సైబరాబాద్ కమిషనరేట్ ట్రాఫిక్ విభాగం ఐటీ కారిడార్‌పై ప్రత్యేక దృష్టి సారించింది.

ప్రత్యామ్నాయ మార్గాలపై అధ్యయనం

ఐటీ కారిడార్‌లో ప్రధానంగా కొండాపూర్-మాదాపూర్-జూబ్లీహిల్స్ మార్గం, జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45 నుంచి దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి మీదుగా మైండ్ స్పేస్ జంక్షన్, గచ్చిబౌలి.. అదే విధంగా మెహిదీపట్నం నుంచి టోలిచౌకి-షేక్‌పేట-రాయదుర్గం-గచ్చిబౌలి వంటి మార్గాలకు ప్రత్యాయ్నాయ దారులను అందుబాటులోకి తీసుకురావడంపై క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఈ మార్గాల్లో నిర్మించిన ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, లింకు రోడ్లన్నీ జామ్ అవుతున్నాయి. మాదాపూర్ ఇమేజ్ ఆస్పత్రి నుంచి మైండ్ స్పేస్ ఐటీ సెజ్ మీదుగా టీ హబ్ కూడలి నుంచి రాయదుర్గం-నానక్‌రాంగూడ వెళ్లే మార్గాన్ని ప్రధాన రహదారిగా అందుబాటులోకి తీసుకువస్తే ఈ మార్గాల్లో వచ్చే వాహనాలను అంతర్గత రోడ్లకు మళ్లించేందుకు అవకాశం ఉంటుందని ప్రాథమికంగా గుర్తించారు. అవసరమైన ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ చేపడితే వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతుందని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులను సైతం ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోల రాకపోకలకు అనుకూలంగా చేస్తే కొంత ప్రయోజనం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా రూట్‌మ్యాప్‌లను రూపొందించి జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ట్రాఫిక్ అధికారులు పనిచేయనున్నారు.

ఐటీ కారిడార్‌లో రద్దీగా ఉండే కూడళ్లు..

- సైబర్ టవర్స్
- మైండ్ స్పేస్ జంక్షన్
- రాయదుర్గం బయోడైవర్సిటీ
- గచ్చిబౌలి ఓఆర్ఆర్ జంక్షన్
- రాయదుర్గం-ఖాజాగూడ రోడ్డు
- నానక్‌రామ్‌గూడ ఓఆర్ఆర్ జంక్షన్
- ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్ విప్రో సర్కిల్
- గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీ జంక్షన్
- కొండాపూర్ బొటానికల్ గార్డెన్
- జూబ్లీహిల్స్-అయ్యప్ప సొసైటీ రోడ్డు జంక్షన్



కేపీహెచ్‌బీలో క్రిస్టియన్ మైనార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న శేరి సతీష్‌రెడ్డి

క్రిస్టియన్ మైనార్టీ కార్యాలయం ప్రారంభం

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కేపీహెచ్‌బీలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రిస్టియన్ మైనార్టీ కార్యాలయాన్ని సోమవారం కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గం మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి ప్రారంభించారు. ప్రతి డివిజన్‌లో క్రిస్టియన్ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా ఆశాఖ కోఆర్డినేటర్ క్రిష్టఫర్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో హాసిటోచర్, జాన్, ఫణీంద్రకుమార్, ప్రవీణ్‌కుమార్, ఆర్.ఎ.పాల్, మయూరి, పొడుగు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



చైతన్యబస్తీలో పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహేందర్

బస్తీలలో నీటి ఇబ్బందులు పరిష్కరిస్తాం

కూకట్‌పల్లి, జవవరి 20(ఆంధ్రజ్యోతి): మూసాపేట డివిజన్ బస్తీలలో నీటి ఇబ్బందులు తలెత్తకుండా సమస్యలు పరిష్కరిస్తామని బీజేపీ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అన్నారు. సోమవారం 117 డివిజన్ పరిధిలోని చైతన్యబస్తీలో కొత్తగా వేసిన పైప్‌లైన్ పనులను స్థానిక బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు. మంచినీటి, మురుగునీటి పైప్‌లైన్ ఒకేచోట మ్యాన్‌హోల్ కలపరాదని అధికారులను కోరినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి నల్లా కనెక్షన్లు ఇవ్వాలని జలమండలి అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఎర్రాస్వామి, నాయకులు మల్లేశ్‌గౌడ్, ఐలయ్య, రవికుమార్‌గౌడ్, రమేశ్‌నాయర్, క్రాంతికుమార్ బస్తీవాసులు పాల్గొన్నారు.

మూసాపేటలో నీటిసమస్య, డ్రైనేజీ ఇబ్బందులు పరిష్కరించండి



వాటర్‌వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మూసాపేట మాజీ కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్

కూకట్‌పల్లి, జవవరి 20(ఆంధ్రజ్యోతి): మూసాపేట డివిజన్ పరిధిలో నీటి ఇబ్బందులు, డ్రైనేజీ ఓవర్ ఫ్లో సమస్యలను వెంటనే పరిష్కరించాలని 117 మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్‌కుమార్ వాటర్ వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డిని కోరారు. సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో వాటర్‌వర్క్స్ ఎండీని కలిసి మూసాపేట డివిజన్ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, బాలాజీ స్వర్ణపురి కాలనీలో బహుళ అంతస్థుల నిర్మాణాలు కొనసాగుతున్నందున ఆ ప్రాంతానికి కిందివైపు ఉన్న ప్రాంతాలలో నీటి కొరత ఏర్పడుతున్నందున ఆ ప్రాంతంలో 300 మీటర్ డయాపైపు కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. డివిజన్ పరిధిలోని అవంతినగర్ ఈస్ట్, బబ్బుగూడ, జనతానగర్‌లలో డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్యలు ఉన్నాయని, వాటి స్థానంలో కొత్తపైపులు వేయాలని కోరడంతో ఎండీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. నిధులను అత్యంత ప్రాధాన్యతా క్రమంలో తీసుకుని సమస్యల పరిష్కారంకోసం కృషి చేస్తామని తెలిపారు.



అనంతరాములు దంపతులను సన్మానిస్తున్న వీరాంజనేయ దేవాలయ కమిటీ సభ్యులు

మహాకుంభమేళా దర్శనం పూర్వజన్మ సుకృతం

కూకట్‌పల్లి, జవవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రపంచ నలుమూలల నుంచి కోట్లాది మంది మహా కుంభమేళాను దర్శించుకుని పుణ్యస్నానాలు చేయడం పూర్వజన్మసుకృతమని వీరాంజనేయ దేవాలయ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. పాపిరెడ్డి కాలనీలోని శ్రీ వీరాంజనేయ శివాలయంలో మహాకుంభమేళా నుంచి వచ్చిన మాదాసు అనంతరాములు దంపతులకు ఘన స్వాగతం పలికారు. కాశీ విశ్వేశ్వరస్వామిని 55మార్లు దర్శించుకుని కుంభమేళాలో 3 పుణ్యస్నానాలు చేసి కాలానికి రావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి దొడ్ల రామిరెడ్డి, ఏసీరెడ్డి భూపాల్‌రెడ్డి, అక్కిరెడ్డి, శరత్‌రెడ్డి, కిరణ్, నరహరిగౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) :కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ.13, వంకాయ రూ.23, బెండకాయ రూ.35, పచ్చి మిర్చి రూ.40, బజ్జి మిర్చి రూ.40, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, క్యాబేజీ రూ.13, బీన్స్ రూ.40, క్యారెట్ రూ.32, గోబి పువ్వు రూ.30, దొండకాయ రూ.42, చిక్కుడు కాయ రూ.45, గోరు చిక్కుడు రూ.28, బీట్‌రూట్ రూ.23, క్యాంప్సికం రూ.40, ఆలుగడ్డ రూ.27, కీర రూ.25, దోసకాయ రూ.20, సొరకాయ రూ.20, పొట్లకాయ రూ.20, కంద రూ.65, ఉల్లిపొరక రూ.35, ఉల్లిగడ్డ రూ.32, మామిడి కాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామగడ్డ రూ.40, ముల్లంగి రూ.5, చిలగడ దుంప రూ.35, గుమ్మడికాయ రూ.30, నిమ్మకాయలు రూ.30-40, మునగ కాయలు రూ.10-12, పచ్చి బఠాణి రూ.40, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.200, అల్లం రూ.80, వెల్లుల్లి రూ.340, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.50, కరివేపాకు రూ.80, పర్వల్ రూ.55, పల్లికాయ రూ.65. పైన పేర్కొన్న ధరలు ఈరోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

హైదర్‌నగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కూకట్‌పల్లి జీహెచ్ఎంసీ కమిషనర్‌కు సీపీఐ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. పేదలు ఇంటి అద్దెలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని, కూలి పనులు చేసిన సంపాదించిన దానిలో సగానికిపైగా అద్దెలకే సరిపోతుందని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని వినతి పత్రంలో వివరించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి సీపీఐ కార్యదర్శి కృష్ణ, మనోచారి తదితరులు పాల్గొన్నారు.

బడులు, గుడుల జోలికి వస్తే ఊరుకోం

- హౌసింగ్ బోర్డు అధికారుల తీరుపై ఆగ్రహించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కల్యాణ మండపం సీజ్ చేయడంపై ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, చిత్రంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అంటే ప్రజల గురించి ఆలోచించాలి. ఆలయాలు, పాఠశాలల కోసం స్థలం వదిలి పెట్టకపోతే ఎలా ? స్థలాలను అమ్ముకొని సొమ్ము చేసుకోవడమే మీ పనా అంటూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం కేపీహెచ్‌బీలోని గోవర్ధనగిరి కొండపై కల్యాణ మండపాన్ని హౌసింగ్‌బోర్డు అధికారులు సీజ్ చేయడంతో సోమవారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడికి వచ్చిన స్థానికులు సీల్ తొలగించేదెప్పుడు ? ఎలా అని ఎమ్మెల్యేని అడగడంతో భక్తుల మనోభావాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని, సీల్ తొలగించే బాధ్యత ఆ వేణుగోపాల స్వామి హౌసింగ్‌బోర్డు అధికారుల కళ్లు తెరిపిస్తారని ఎమ్మెల్యే జోస్యం చెప్పారు.

అమ్ముకోవడం.. సొమ్ము చేసుకోవడమేనా ?

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాల గురించి ఆలోచించడం మరిచిపోయి.. ఖాళీగా ఉన్న స్థలాలు, బడులు, గుడులకు కూడా లేకుండా అమ్మి సొమ్ముచేసుకునే ప్రయత్నం చేస్తుందన్నారు. ముందు 10శాతం స్థలాలను హౌసింగ్‌బోర్డు ప్రజలకు చూపించిన తర్వాతనే వేలం వేయాలని, లేదంటే ఈనెల 24న జరిగే వేలం పాటను స్థానికులు, కార్పొరేటర్‌తో కలిసి అడ్డుకుంటానన్నారు. బడులు, గుడుల జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. 100 గజాలలోపు ఉన్న స్థలాలను జీవో నంబర్-6 ప్రకారం వేలం కాకుండా పక్కనే ఉన్న వారికి కేటాయించాలని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా వేలం వేసే విషయంలో పునరాలోచించాలని, ప్రజలకు చెందాల్సిన స్థలాలను అమ్ముకొని సొమ్ము చేసుకుంటామంటే చూస్తూ ఊరుకుంటామా ? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క గజం అయినా అమ్మామా? కబ్జాకోరులు, న్యాయస్థానాల్లో ఉన్న 24 ఎకరాలను కాపాడుకున్న చరిత్ర బీఆర్ఎస్ పార్టీకే చెందుతుందన్నారు. వేణుగోపాల స్వామికి ధూపదీప నైవేద్యాలు, ఆలయ నిర్వాహణ, భక్తుల సౌకర్యార్థం కల్యాణం మండపం నిర్మించి ఏళ్లు గడుస్తున్నా చడీచప్పుడు కాకుండా సీజ్ చేయడం ఏంటి అని ఆయన ప్రశ్నించారు.

జాతీయ జెండా దిమ్మె తొలగిస్తారా ?

కేపీహెచ్‌బీ ఒకటో రోడ్డులోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద జాతీయ జెండా ఎగురవేసే దిమ్మెను తొలగించి కాంగ్రెస్ పార్టీ దిమ్మెకు జాతీయ జెండా పెట్టడంపై మాధవరం ఆగ్రహించారు. తాను సొంత నిధులతో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే దాని ముందున్న దిమ్మెను జీహెచ్ఎంసీ తొలగించడం ఏంటి? వెంటనే పాత దిమ్మెను పునఃనిర్మించి జాతీయ జెండాను కట్టాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ప్రహరీ ఎందుకు కట్టరు ?

కేపీహెచ్‌బీ రమ్యగ్రౌండ్ స్థలం మాది అని ఇటీవల హౌసింగ్ బోర్డు అధికారులు బోర్డులు పాతిన విషయం తెలిసిందే. అదే గ్రౌండ్‌లో బాస్కెట్‌బాల్ ఆడుతున్న వైపు ప్రహరీ కూలిపోయి నెలలు గడుస్తున్నా ఎందుకు పునఃనిర్మించలేదని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఆన్‌లైన్‌లో కూడా రమ్యగ్రౌండ్ జీహెచ్ఎంసీ అని ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబురావు, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ సతీష్ అరోరా, అధ్యక్షులు కృష్ణారెడ్డి, రాజేష్ రాయ్, మందలపు సాయిబాబు చౌదరి, జన్నుసాయి, పాతూరి గోపి తదితరులు ఉన్నారు.

కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

- అధ్యాపకులకు జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ బాలకిష్టారెడ్డి పిలుపు



హైదరాబాద్ సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నూతన సాంకేతికతలను అందిపుచ్చుకునేందుకు అధ్యాపకులు సన్నద్ధం కావాలని జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ బాలకిష్టారెడ్డి పిలుపునిచ్చారు. ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల అధ్యాపకులకు జేఎన్‌టీయూ సైబర్ సెక్యూరిటీ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. వీసీ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. ఈ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎఫ్‌డీపీ).. సైబర్‌సెక్యూరిటీ, ఫోరెన్సిక్ రంగాల్లో అధ్యాపకులకు ఆధునిక పరిజ్ఞానం, నైపుణ్యాలతో పాటు ఆవిష్కరణలు, విద్యా సహకారాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందన్నారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అకడమిక్ కో-ఇన్నోవేషన్ విభాగాధిపతి శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ సెక్యూరిటీ నైపుణ్యాలు కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. డైరెక్టర్ ఆర్. శ్రీదేవి మాట్లాడుతూ.. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ సైబర్ సెక్యూరిటీ చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. అలాగే ఈ కార్యక్రమానికి వివిధ ఇంజనీరింగ్ కాలేజీల అధ్యాపకులతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ విద్యాసంస్థలు, ప్రభుత్వరంగ సంస్థలు, ఐటీ కంపెనీల నిపుణులు పాల్గొంటున్నారని వెల్లడించారు. అలాగే నగరంలోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ఉస్మానియా యూనివర్సిటీ, నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా, కేంద్ర న్యాయ విజ్ఞానశాస్త్ర ప్రయోగశాల, తెలంగాణ స్టేట్ ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ, టీసీఎస్, సీడాక్-హైదరాబాద్, కార్నింగ్ ఆప్టికల్ కమ్యూనికేషన్స్ తదితర కంపెనీల నుంచి నిపుణులు పాల్గొన్నారని వెల్లడించారు.

ప్రజావాణికి 13 ఫిర్యాదులు

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణికి 13 ఫిర్యాదులు అందాయి. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ తదితర విభాగాల సంబంధించి ప్రజలు రాతపూర్వకంగా తెలియజేశారని జోనల్ ఏఎంసీ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. జడ్సీ ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఆయా సర్కిల్స్‌లోని విభాగాలకు పంపించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఓల్డుబోయినపల్లి/ఫతేనగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఓల్డు బోయినపల్లి, ఫతేనగర్ డివిజన్లలోని కాలనీల్లో యూజీడీ, సీవరేజ్ సమస్యలు ఉన్నాయని, కొత్త పైప్‌లైన్‌ను వేసి సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్లు జలమండలి అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో ఓల్డుబోయినపల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మ యాదవ్, ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ ఖైరతాబాద్‌లోని హైదరాబాద్ మెట్రోపాలిటన్ జలమండలి, సీవరేజ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

మృతి చెందిన బాలుడి కుటుంబానికి రూ. 2లక్షల ఆర్థిక సాయం

ఫతేనగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్ ఇందిరాగాంధీపురంలో ఆడుకుంటూ వెళ్లి నాలాలో పడి, గల్లంతై మృతి చెందిన బాలుడు షేక్‌ముజ్మిల్ తల్లి దండ్రులను ఆదుకునేందుకు జీహెచ్ఎంసీ ముందుకు వచ్చింది. మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేయాలని కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, స్థానికులు విజ్ఞప్తి చేయడంతో జీహెచ్ఎంసీ అధికారులు స్పందించారు. రూ. 2లక్షల విలువ చేసే చెక్కును నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి కాంగ్రెస్ కూకట్‌పల్లి బండి రమేష్‌తో కలిసి తన కార్యాలయంలో చెక్కును బాలుడి తల్లిదండ్రులకు అందజేశారు. తమను ఆదుకున్నందుకు బాలుడి తల్లి దండ్రులు మేయర్ విజయలక్ష్మి, కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లక్ష్మయ్య, అయాజ్, కే. రమేష్ పాల్గొన్నారు.



నాలాలో పడి గల్లంతైన షేక్ ముజ్మిల్ తల్లిదండ్రులకు రూ.2లక్షల చెక్కును అందజేస్తున్న నగర మేయర్ విజయలక్ష్మి, కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్

కబ్జాలన్నీ మాధవరం కనుసన్నల్లోనే: పట్లోళ్ల

ఫతేనగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు స్థలాల వేలంను అడ్డుకుని తీరుతామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ కూకట్‌పల్లి ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి తీవ్రంగా ఖండించారు. గడిచిన పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో హౌసింగ్ బోర్డులో విలువైన స్థలాలను ఎమ్మెల్యే అనుచరులు కబ్జా చేసుకున్నారని, ఈ కబ్జాలన్నీ మాధవరం కనుసన్నల్లోనే జరిగాయని ఆరోపించారు. 1960లో తెలుగు రాష్ట్రం ఏర్పాటైన తరువాత అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చొరవతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు సొంత ఇంటి కల నెరవేరాలనే ఉద్దేశ్యంతో స్వతంత్ర సంస్థగా ఏర్పడిన హౌసింగ్ బోర్డు సంస్థను బీఆర్ఎస్ నాయకులే నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఎమ్మెల్యే కృష్ణారావు హౌసింగ్‌బోర్డు స్థలాల ద్వారా వ్యక్తిగత లబ్ధి పొందేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారని, ప్రభుత్వం ఇప్పుడు వేలం వేస్తున్నట్లు ప్రకటించడంతో జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. ప్రజా వినియోగానికి అనువుగా ఉన్న స్థలాలను వేలం వేస్తే కబ్జా చేసి అక్రమంగా కట్టుకున్న నిర్మాణాలు వెలుగులోకి వస్తాయని ఎమ్మెల్యే అనుచరులు జంకుతున్నారని మండిపడ్డారు. పదేండ్లలో బీఆర్ఎస్ భారీ కట్టడాలు, పార్కుల సుందరీకరణకే పరిమితమైందని, కానీ ఇప్పుడున్నది దొరల ప్రభుత్వం కాదని, ప్రజా ప్రభుత్వం పాలన కొనసాగుతోందని, హౌసింగ్ బోర్డు స్థలాల వేలంను అడ్డుకుంటామంటే చూస్తూ ఊరుకోబోమని నాగిరెడ్డి ఎద్దేవా చేశారు.



ఎంపీ ఈటలను కలిసిన మూసాపేట కార్పొరేటర్ మహేందర్, డివిజన్ అధ్యక్షుడు ఎర్రాస్వామి

కూకట్‌పల్లిలో బీజేపీని మరింత బలోపేతం చేద్దాం

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

కూకట్‌పల్లి, జవవరి 20(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో బీజేపీని మరింత బలోపేతం చేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ నూతన అధ్యక్షుడిగా నియమితులైన ఎర్రాస్వామితో పాటు స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఎంపీని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. కేంద్రప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఇంటింటా ప్రచారం చేయాలని బీజేపీ నాయకులకు ఎంపీ సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మల్లేశ్‌గౌడ్, పిట్ల మనోహర్, సద్గుణరెడ్డి, ఐలయ్యయాదవ్, సతీష్‌చారి, రమేశ్‌నాయర్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



ట్రక్ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ శ్రీనుబాబు

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

కూకట్‌పల్లి, జవవరి 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకారం అందించాలని కూకట్‌పల్లి ఎంవీఐ శ్రీనుబాబు కోరారు. రోడ్డుభద్రతా వారోత్సవాల్లో భాగంగా కూకట్‌పల్లిలోని ట్రక్‌పార్కులో ట్రక్ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అతివేగంతో వాహనాలు నడపరాదని, మద్యం మత్తులో వాహనాలను నడిపి ఎంతోమంది ప్రమాదాల బారినట్లు గుర్తుచేశారు.

తాగునీరు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి



వాటర్‌వర్క్స్ అండ్ సీవరేజ్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

హైదర్‌నగర్, జనవరి20(ఆంధ్రజ్యోతి): రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని కూకట్‌పల్లి నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరించడంతో పాటు పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హైదరాబాద్ వాటర్‌వర్క్స్ అండ్ సీవరేజ్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు నియోజకర్గం పరిధిలో బీఆర్ఎస్ కార్పొరేటర్లతో కలిసి ఎమ్మెల్యే వినతి పత్రం అందజేశారు. పలు ప్రాంతాల్లో తాగునీటిలో మురుగునీరు కలిసి సరఫరా అవుతోందని దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కూకట్‌పల్లి డివిజన్ జలమండలి అధికారులకు స్థానిక సమస్యలపై ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ నిధుల కొరతతో పనులు జరగడం లేదని తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు నిధులను మంజూరు చేయాలని కోరారు.



అరుణను సన్మానిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

స్టేట్ మహిళా కాంగ్రెస్ సెక్రటరీగా అరుణ

హైదర్‌నగర్, జనవరి20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ మహిళా కాంగ్రెస్ సెక్రటరీగా ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీకి చెందిన సి.అరుణను నియమించారు. ఈ సందర్భంగా సోమవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అరుణను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మెజేష్, రాజ్యలక్ష్మి, సౌందర్య, కృష్ణవేణి పాల్గొన్నారు.



మహిళకు కుట్టుమిషన్ అందజేస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

పేద మహిళకు కుట్టుమిషన్ అందజేత

హైదర్‌నగర్, జనవరి20(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ పీజేఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్న పేద మహిళ కంసమ్మకు హోప్ ఆఫ్ హంగర్ చారిటబుల్ ట్రస్ట్ సోమవారం కుట్టుమిషన్‌ను అందజేసింది. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ట్రస్టు ప్రతినిధులతో కలిసి మహిళకు కుట్టుమిషన్ అందజేశారు. ట్రస్ట్ నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, షకీల్‌మున్నా, నాగేశ్వరరావు, సూరిబాబు, హోప్ ఆఫ్ హంగర్ సంస్థ టీమ్‌మెంబర్స్ అలేఖ్య, వెంకటేశ్వరరావు, మల్లీశ్వరి, రవికిరణ్, అమూల్య తదితరులు పాల్గొన్నారు.



వరదనీటి కాల్వ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

వరదనీటి కాల్వ పనుల పరిశీలన

హైదర్‌నగర్, జనవరి20 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ నిజాంపేట్ రోడ్డు హోలిస్టిక్ హాస్పిటల్ వద్ద జరుగుతున్న వరదనీటి కాలువ పనులను సోమవారం కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, అన్ని శాఖల అధికారులు, ప్రజల సహకారంతో పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. పనులు జరుగుతున్న సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ట్రాఫిక్ మళ్లింపు విషయంలో అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. అదేవిధంగా పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎస్‌ఈ చిన్నారెడ్డి, ఈఈ గోవర్ధన్, ఏఈ రాజీవ్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ మహదేవ్, హెచ్‌ఎండబ్ల్యుఎస్‌ఎస్‌బి డీజీఎం నాగప్రియ, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వీరన్న, ఇన్‌స్పెక్టర్ జానయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజావాణికి విశేష స్పందన

గచ్చిబౌలి, జనవరి20(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి విశేష స్పందన లభించింది. ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చి తాము ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రేషన్‌కార్డులు రాలేదని, జీరో కరెంటు బిల్లు కోసం దరఖాస్తు చేసుకున్నాం. జీరో బిల్లు రావడం లేదని, పెన్షన్‌లు, వీధి దీపాలు ఇందిరమ్మ ఇళ్ల కోసం అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ ముకుందారెడ్డి మాట్లాడుతూ, సమస్యలను ఆయా శాఖల అధికారులకు పంపి త్వరితగతిన పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్ అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంఐజీ కాలనీలో..

శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని ఎంఐజీకాలనీ ఫేజ్-3లోని వివేకానంద్‌పార్కులో స్థానికులు నిర్మాణ వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నారని, దీనివల్ల పార్కుకు వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. కాలనీ సంక్షేమసంఘం సహకారంతోనే పార్కు కాస్తా డంపింగ్ యార్డుగా మారిందని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.



పార్కులో డంప్ చేసిన నిర్మాణ వ్యర్థాలు



చెరువు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీకాంత్

గుర్నాథం చెరువు రూపురేఖలు మారుస్తాం

మియాపూర్, జనవరి20(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని చెరువులను సుందరీకరించి పరిసర ప్రాంత ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందిస్తామని మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. నెక్స్‌సూస్ సెలక్ట్ మాల్స్ కంపెనీ సీఎస్‌ఆర్ ఫండ్స్ ద్వారా మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న మియాపూర్ గుర్నాథం చెరువు సుందరీకరణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గుర్నాథం చెరువుకు శాశ్వత పరిష్కారం దిశగా చెరువును అభివృద్ధి చేపట్టినట్లు, మురికి కూపం లాంటి చెరువును స్వచ్ఛమైన మంచినీటి చెరువుగా మారుస్తామన్నారు. చెరువు చుట్టు మొక్కలను పెంచి చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం అందిస్తామన్నారు. ఎమ్మెల్యే గాంధీ సహకారంతో మల్లిగవాడ్ ఫౌండేషన్ పనులు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు చైతన్య, రాము, స్థానిక నాయకులు లోకేష్, రమేష్, అనిల్, రాజేష్, సుధాకర్, కేవీఎస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేలా..

- ఐటీ కారిడార్ కూడళ్లపై అధికారుల ప్రత్యేక దృష్టి
- ప్రత్యామ్నాయ మార్గాలపై సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల అధ్యయనం
- ప్రత్యేక రూట్‌మ్యాప్‌లతో సమస్యను పరిష్కరించే యత్నం
- త్వరలోనే కార్యరూపం దాల్చే అవకాశం



కూకట్‌పల్లి జేఎన్‌టీయూ రోడ్డు

హైదరాబాద్ సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగరంలో అత్యధిక సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా ఐటీ కారిడార్ మారింది. కేవలం ఐటీ రంగంలోనే సుమారు 9.5 లక్షల మంది వెస్ట్ హైదరాబాద్ పరిధిలోని ఐటీ కారిడార్‌లో పనిచేస్తున్నారు. దీంతో నగరం నలుమూలల నుంచి ఉద్యోగులు మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, నానక్‌రామ్‌గూడ, కోకాపేట, పుప్పాల్‌గూడ వంటి ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లోనే కాకుండా ఇతర సమయాల్లోనూ రోడ్లపై రద్దీ అధికంగా ఉంటోంది. ఆ ప్రాంతాల్లో ఐటీ కంపెనీల కార్యకలాపాలే కాకుండా భవన నిర్మాణ రంగానికి సంబంధించిన పనులు భారీ ఎత్తున జరుగుతుండడంతో ఆ రంగాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు నగరం నలుమూలల నుంచి ఇక్కడికి వస్తుంటారు. దీంతో నగరంలో ఎక్కడా లేనివిధంగా ఐటీ కారిడార్ పరిధిలో ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయి. కొత్తగా ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, లింకు రోడ్లు నిర్మించినా ప్రధాన రహదారులు, కూడళ్లపై రద్దీ పెరుగుతోందే తప్ప తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో సైబరాబాద్ కమిషనరేట్ ట్రాఫిక్ విభాగం ఐటీ కారిడార్‌పై ప్రత్యేక దృష్టి సారించింది.

ప్రత్యామ్నాయ మార్గాలపై అధ్యయనం

ఐటీ కారిడార్‌లో ప్రధానంగా కొండాపూర్-మాదాపూర్-జూబ్లీహిల్స్ మార్గం, జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45 నుంచి దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి మీదుగా మైండ్ స్పేస్ జంక్షన్, గచ్చిబౌలి.. అదే విధంగా మెహిదీపట్నం నుంచి టోలిచౌకి-షేక్‌పేట-రాయదుర్గం-గచ్చిబౌలి వంటి మార్గాలకు ప్రత్యామ్నాయ దారులను అందుబాటులోకి తీసుకురావడంపై క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఈ మార్గాల్లో నిర్మించిన ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, లింకు రోడ్లన్నీ జామ్ అవుతున్నాయి. మాదాపూర్ ఇమేజ్ ఆస్పత్రి నుంచి మైండ్ స్పేస్ ఐటీ సెజ్ మీదుగా టీ హబ్ కూడలి నుంచి రాయదుర్గం-నానక్‌రాంగూడ వెళ్లే మార్గాన్ని ప్రధాన రహదారిగా అందుబాటులోకి తీసుకువస్తే ఈ మార్గాల్లో వచ్చే వాహనాలను అంతర్గత రోడ్లకు మళ్లించేందుకు అవకాశం ఉంటుందని ప్రాథమికంగా గుర్తించారు. అవసరమైన ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ చేపడితే వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతుందని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులను సైతం ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోల రాకపోకలకు అనుకూలంగా చేస్తే కొంత ప్రయోజనం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా రూట్‌మ్యాప్‌లను రూపొందించి జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ట్రాఫిక్ అధికారులు పనిచేయనున్నారు.

ఐటీ కారిడార్‌లో రద్దీగా ఉండే కూడళ్లు..

- సైబర్ టవర్స్
- మైండ్ స్పేస్ జంక్షన్
- రాయదుర్గం బయోడైవర్సిటీ
- గచ్చిబౌలి ఓఆర్‌ఆర్ జంక్షన్
- రాయదుర్గం-ఖాజాగూడ రోడ్డు
- నానక్‌రామ్‌గూడ ఓఆర్‌ఆర్ జంక్షన్
- ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్ విప్రో సర్కిల్
- గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీ జంక్షన్
- కొండాపూర్ బొటానికల్ గార్డెన్
- జూబ్లీహిల్స్-అయ్యప్ప సొసైటీ రోడ్డు జంక్షన్

బర్లకుంట చెరువుకు మహర్దశ: ఎమ్మెల్యే ఆరెకపూడి



బర్లకుంట చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి, జనవరి20(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి డివిజన్ బర్లకుంట చెరువుకు త్వరలో మహర్దశ రానుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. సోమవారం ఆయన కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి బర్లకుంట చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్వరలో చెరువు సంరక్షణ, అభివృద్ధి పనులు, సుందరీకరణ పనులుచేపట్టడం జరుగుతుందన్నారు. పనులు పూర్తయితే పరిసర కాలనీల వాసులకు ప్రశాంత వాతావరణం సొంతం అవుతుందన్నారు. చెరువు సుందరీకరణతో పాటు చెరువు కట్టను పటిష్టం చేయడం, మురుగునీరు చెరువులో కలవకుండా ప్రత్యేకంగా చెరువుచుట్టూ మురుగుకాల్వలు నిర్మించి కిందకు వదులుతారన్నారు. చెరువు కబ్జాకాకుండా ఫెన్సింగ్ నిర్మాణం, అలుగు వంటి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నాం

ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా తాను పనిచేస్తున్నానని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. సోమవారం శేరిలింగంపల్లి డివిజన్ శిల్పాగార్డెన్స్, క్రాంతివనం, ఫ్రెండ్స్ కాలనీలో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో సీసీరోడ్లు నిర్మించామని, పెండింగ్ లో ఉన్న ప్రాంతాల్లో కూడా పూర్తిచేస్తామన్నారు. శేరిలింగంపల్లిని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. నిరంతరం నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు.



గరికపాటి మోహన్‌రావును కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న రమేష్

మాజీ ఎంపీని కలిసిన రమేష్

హైదర్‌నగర్, జనవరి20(ఆంధ్రజ్యోతి): మాజీ రాజ్యసభ సభ్యుడు, బీజేపీ జాతీయకార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావును ఆల్విన్‌కాలనీ డివిజన్ బీజేపీ నూతన అధ్యక్షుడు ఎత్తరి రమేష్ మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషిచేయాలని గరికపాటి సూచించారు.



చాకలివానికుంటను పరిశీలిస్తున్న అధికారులు

త్వరలో చాకలివానికుంట సుందరీకరణ

గచ్చిబౌలి, జనవరి20(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని చాకలివానికుంటను సుందరీకరణ, అభివృద్ధి చేసేందుకు అధికార యంత్రాంగం కదిలింది. నవంబరు 26న చెరువు చాకలివానికుంట పక్కనున్న ఆదర్శ్‌నగర్‌లో ఉంటున్న లక్ష్మీనాయుడు సీఎం రేవంత్‌రెడ్డికి చెరువు దుస్థితిని వివరిస్తూ లేఖ రాశారు. కుంటవల్ల పరిసర ప్రాంతాలు దుర్గంధభరితంగా మారి దోమలు వ్యాపించడంతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని తెలిపారు. దీనికి స్పందించిన సీఎం అధికారులను పురమాయించడం జరిగింది. ఇరిగేషన్, శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులు సోమవారం చెరువును పరిశీలించారు. చాకలివానికుంటలో రింగుబాండ్, బేబీపాంట్, చెరువు చుట్టూ ఫెన్సింగ్ పనులతో పాటు పరిసర ప్రాంతాల సుందరీకరణ, మొక్కలు నాటడం వంటి అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. సోమవారం ఈఈ నళిని, ఏఈ శశాంక్, జీహెచ్‌ఎంసీ ఇంజనీర్లు దుర్గారావు, డీఈ ఆనంద్, ఏఈ భాస్కర్ చాకలివాని కుంటను సందర్శించారు. పక్కనే నివాసం ఉంటున్న లక్ష్మీనాయుడిని కలిసి అధికారులు మాట్లాడారు. చాకలివానికుంట చెరువు సుందరీకరణ, అభివృద్ధి పనులు త్వరలో చేపడతామని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్, జనవరి20(ఆంధ్రజ్యోతి): కేఎస్‌ఆర్ ఎన్‌క్లేవ్ 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం మధ్యాహ్నం 2నుంచి 5గంటల వరకు కేఎస్‌ఆర్ ఎన్‌క్లేవ్, 11కేవీ ఇక్రిశాట్ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 5వరకు గ్రీన్‌హిల్స్ అపార్ట్‌మెంట్స్ ఆర్‌వీ నిర్మాణ్ అపార్ట్‌మెంట్స్, ఇక్రిశాట్‌కాలనీలో విద్యుత్ ఉండదని అధికారులు తెలిపారు.

నానక్‌రాంగూడలో...

రాయదుర్గం, జనవరి20(ఆంధ్రజ్యోతి): చర్చి 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నానక్‌రాంగూడ, హనుమాన్ ఆలయం, ఎస్సీ బస్తీల్లో అదేవిధంగా మధ్యాహ్నం 2నుంచి 5గంటల వరకు ట్రెండ్‌సెంట్, నైవద, రాజ్‌పుష్ప, పుప్పాలగూడలో...



ఉచిత ఆక్యుపంక్చర్ వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యులు

300 మందికి వైద్య పరీక్షలు

హైదర్‌నగర్, జనవరి20(ఆంధ్రజ్యోతి): కాస్మిక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆక్యుపంక్చర్ అండ్ నేచురోపతి ఆధ్వర్యంలో హైదరాబాద్ డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో సోమవారం ఉచిత ఆక్యుపంక్చర్ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. రెండు రోజుల పాటు కొనసాగిన ఈ వైద్యశిబిరంలో సుమారు 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. బీపీ షుగర్, థైరాయిడ్, ఆర్థరైటిస్, న్యూరోలాజికల్ వ్యాధులకు ఆక్యుపంక్చర్ వైద్యం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వప్న మాట్లాడుతూ, ఆక్యుపంక్చర్ వైద్య విధానం ద్వారా మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. మెరుగైన జీవనశైలి, సమతుల ఆహారం, నిత్యం వ్యాయామం ఎంతో ముఖ్యమన్నారు. వైద్యులను కాలనీ వాసులు సన్మానించారు.




ఎంపీ ఈటలని కలిసిన మూసాపేట కార్పొరేటర్ మహేందర్, డివిజన్ అధ్యక్షుడు ఎర్రాస్వామి

కూకట్‌పల్లిలో బీజేపీని మరింత బలోపేతం చేద్దాం

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

కూకట్‌పల్లి, జవవరి 20(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో బీజేపీని మరింత బలోపేతం చేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ నూతన అధ్యక్షుడిగా నియమితులైన ఎర్రాస్వామితో పాటు స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఎంపీని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. కేంద్రప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఇంటింటా ప్రచారం చేయాలని బీజేపీ నాయకులకు ఎంపీ సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మల్లేశ్‌గౌడ్, పిట్ల మనోహర్, సద్గుణరెడ్డి, ఐలయ్యయాదవ్, సతీష్‌చారి, రమేశ్‌నాయర్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నిజాంపేట్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నిజాంపేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : నిజాంపేట్ కార్పొరేషన్‌లో సోమవారం అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తల మధ్య నినాదాలతో వివాదం చోటు చేసుకుంది. కార్పొరేషన్‌లోని ఆరు ప్రాంతాల్లో దాదాపు రూ.9 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. అధికార పార్టీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, మేయర్ నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు శంకుస్థాపనను కొనసాగించారు. ఆరు ప్రాంతాల్లో చేపట్టిన శంకుస్థాపనలో మేయర్, మహేందర్‌రెడ్డి, కార్పొరేటర్లతో కలిసి కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. అయిదారు ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హాజరయ్యారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి రాకతో కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా నినాదాలు చేశారు. అప్పటి వరకు వేచి చూస్తున్న డిప్యూటీ మేయర్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్ బాలాజీనాయక్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే రాకతో మరింత రెచ్చిపోయి బీఆర్‌ఎస్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ప్రగతినగర్ వద్ద జరిగిన శంకుస్థాపనలో ఇరు పార్టీల మధ్య నినాదాలు జోరందుకున్నాయి. ఒకరిపై ఒకరు దౌర్జన్యం చేసుకునే పరిస్థితులు ఏర్పడి, తోపులాటలు జరిగాయి. ఈ క్రమంలో బాచుపల్లి పోలీసులు కలుగజేసుకొని ఇరు వర్గాలను అదుపు చేస్తూ, చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఇంత జరుగుతున్నా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మాత్రం చేయి చేయి కలుపుకుంటూ అభివృద్ధి పనులను ముగించుకొని వెళ్లిపోయారు.

దంపతుల ఘర్షణ
పురుగుల మందు తాగి భర్త ఆత్మహత్య

దుండిగల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : భార్యాభర్తల గొడవ ఒకరి ఆత్మహత్యకు దారితీసింది. దుండిగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా, గోవిందరావుపేట మండలం, కరుపల్లి తండాకు చెందిన భానోత్ తిరుపతి(30) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చాడు. గండిమైసమ్మ నిరంజన్ కాలనీలో నివసిస్తూ అక్కడే వాచ్‌మన్‌గా ఏడాది నుంచి పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం భార్యాభర్తలు గొడవపడ్డారు. మనస్తాపం చెందిన తిరుపతి గండిమైసమ్మ చౌరస్తాకు వెళ్లి ఓ షాపులో పురుగుల మందు కొనుక్కొని తాగుతూ.. భార్యకు వీడియో కాల్ చేసి తాను చనిపోతున్నానని చెప్పాడు. భార్య శారద వెంటనే గండిమైసమ్మ చౌరస్తాకు వెళ్లగా తిరుపతి బావర్చి హోటల్ పక్కన ఖాళీ ప్రదేశంలో చనిపోయి ఉన్నాడు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దంపతులు ఎందుకు గొడవపడ్డారనే విషయం తెలియరాలేదు.

విద్యుత్ షాక్‌తో కార్మికుడి మృతి

దుండిగల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లంపేట్‌లో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. భవన నిర్మాణ కార్మికునిగా పని చేస్తున్న సిద్ధార్థవర్మ(31) అనేవ్యక్తి సోమవారం మల్లంపేట్ రోడ్‌నంబరు3లో నిర్మిస్తున్న భవనంవద్ద పనిచేస్తుండగా ఫస్ట్‌ఫ్లోర్‌లో సెంట్రింగ్ రాడ్డును పైకి ఎత్తగా విద్యుత్ వైర్లకు రాడ్డు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై పడిపోయాడు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.



ట్రక్ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ శ్రీనుబాబు

రోడ్డుప్రమాదాల నివారణ అందరి బాధ్యత

కూకట్‌పల్లి, జవవరి 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకారం అందించాలని కూకట్‌పల్లి ఎంవీఐ శ్రీనుబాబు కోరారు. రోడ్డుభద్రతా వారోత్సవాల్లో భాగంగా కూకట్‌పల్లిలోని ట్రక్‌పార్కులో ట్రక్ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అతివేగంతో వాహనాలు నడపరాదని, మద్యం మత్తులో వాహనాలను నడిపి ఎంతోమంది ప్రమాదాల బారినట్లు గుర్తుచేశారు.

రేషన్‌కార్డుల సర్వే పూర్తి

● అనర్హులుగా 256 మంది గుర్తింపు
● కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో 70 శాతం పూర్తి



గాజులరామారం సర్కిల్ కార్యాలయం

కుత్బుల్లాపూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా నూతన రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను మాత్రమే ప్రత్యేకంగా వేరు చేసింది. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో ర్యాండమైజేషన్‌లో కొన్ని దరఖాస్తులు తిరస్కరణకు గురవగా, మిగతావారి వివరాలతో కూడిన జాబితాను సర్కిల్ కార్యాలయాలకు పంపించారు. సదరు జాబితాలో వివరాలు సరిగా ఉన్నాయా..


గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో రేషన్ కార్డుల జాబితాలో ఉన్నవారి పేర్లను తెలుసుకుంటున్న డీసీ మల్లారెడ్డి, సిబ్బంది (ఫైల్)

లేదా..? సర్వే చేయాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగా గాజులరామారం సర్కిల్ పరిధిలోని గాజులరామారం, జగద్గిరిగుట్ట, చింతల్, సూరారం డివిజన్లలో 4472 మంది జాబితాతో సర్వే ప్రారంభించారు. 17 టీంలతో పాటు రిసోర్స్ పర్సన్స్ సహకారంతో అన్ని డివిజన్లలో సోమవారం వరకు 100 శాతం సర్వే పూర్తి చేసినట్లు ఉప కమిషనర్ మల్లారెడ్డి తెలిపారు. అయితే ఇప్పటి వరకు 4472 పేర్ల జాబితాలో 256 మంది దరఖాస్తులను తిరస్కరణకు గురైనట్లు వెల్లడించారు.

అయితే అన్ని దరఖాస్తులను ఆయా డివిజన్ల పరిధిలోని వార్డు కార్యాలయాల్లో నాలుగు రోజులపాటు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కమిటీ వేసి ప్రజల సమక్షంలోనే చివరిసారిగా విచారణ ప్రారంభిస్తామన్నారు. అర్హులను తేలిన వారందరికి ఈ నెల 26వ తేదీ వరకు రేషన్ కార్డులను అందజేయనున్నట్లు తెలిపారు.

కుత్బుల్లాపూర్‌లో 70 శాతమే

ఇదిలా ఉండగా కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని రంగారెడ్డినగర్, సుభాష్‌నగర్, కుత్బుల్లాపూర్, జీడిమెట్ల డివిజన్ల పరిధిలోని ప్రజలు కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్న 3449 మంది జాబితాను ఉన్నతాధికారులు తమకు అప్పగించగా 70 శాతం మాత్రమే సర్వే పూర్తిచేసినట్లు ఉప కమిషనర్ నర్సింహ తెలిపారు. 100 శాతం సర్వే పూర్తి చేసి అర్హులందరికీ కార్డులు అందేలా చూస్తామని తెలిపారు.

తాగునీటి కష్టాలకు పరిష్కారమెప్పుడో..?

● పద్మానగర్ వాసులను వెక్కిరిస్తున్న తాగునీటి సరఫరా
● పట్టించుకోని జలమండలి అధికారులు

కుత్బుల్లాపూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని పద్మానగర్ ఫేజ్-1 వాసులను తాగునీటి సమస్య వెక్కిరిస్తోంది. కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలో ఉన్న ఈ కాలనీలో 440 నివాసాలు, 60 వరకు అపార్ట్‌మెంట్లుండగా సుమారు 3 వేల పైచిలుకు జనాభా నివాసముంటోంది. హైదరాబాద్ మహానగరమని చెప్పుకునేది కేవలం పాలకునేనని, కానీ సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2002లో అప్పటి ప్రభుత్వం 50-50 చొప్పున అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఒక్కో ఇంటికి రూ.7500ల చొప్పున లెక్క చేసి 200 ఇళ్లకు రూ.15 లక్షల ఖర్చవుతుందని అధికారులు తెలిపారు. దీంతో అక్కడి ఇళ్ల యజమానులు సగం డబ్బులను చెల్లించగా ప్రభుత్వం సగం చెల్లించి సీపీ పైప్‌లైన్ ఏర్పాటు చేయించింది. అప్పట్లో జగద్గిరిగుట్ట రిజర్వాయర్ నుంచి పుష్కలంగా తాగునీరు సరఫరా అయ్యేది. కానీ సమీపంలోని రాంరెడ్డినగర్ రిజర్వాయర్ నుంచి ఈ కాలనీకి లైన్ కలపడంతోనే సమస్య మొదలైంది. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా అధికారుల పనితీరు మారిందని పలువురు తెలుపుతున్నారు. పద్మానగర్ ఫేజ్-1 కాలనీ ఎత్తులో ఉండగా రిజర్వాయర్ కిందికి ఉండడంతో తాగునీరు సరిపడా పైకి రావడంలేదు. అంతేకాకుండా తమ కాలనీకి కొద్ది సమయం మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారని స్థానికులు తెలుపుతున్నారు. దీంతో వచ్చిన తాగునీరు సరిపోవడంలేదని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి తాగునీటి సరఫరా సక్రమంగా అయ్యేలా చూడాలని కాలనీ వాసులు వేడుకుంటున్నారు.


పద్మానగర్ ఫేజ్-1 కాలనీ ప్రధాన రోడ్డు

ప్రత్యామ్నాయం చూపండి



మా కాలనీకి జగద్గిరిగుట్ట రిజర్వాయర్ నుంచి వచ్చినప్పుడే నీటి సరఫరా మంచిగా అయ్యేది. ఇక్కడి రిజర్వాయర్‌కు కలుపడంతో సమస్య ప్రారంభమైంది. మరలా జగద్గిరిగుట్ట రిజర్వాయర్ నుంచి మాకు నీటిని సరఫరా చేయాలని అధికారులను అడిగితే అక్కడి వారికే సరిపోవడంలేదని, ప్రస్తుతమున్న లైన్‌తోనే సర్దుకుపోవాలని కావాలని ఉచిత సలహాలిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మా కాలనీ వాసులకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి సమస్యను పరిష్కరించాలి. లేదంటే ఆందోళనలు చేసి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

సత్తిరెడ్డి, సంక్షేమ సంఘం అధ్యక్షులు, పద్మానగర్ ఫేజ్-1

నీరు సరిగా రావడంలేదు



కొన్ని సంవత్సరాలుగా పద్మానగర్ కాలనీ ఫేజ్-1లో నివాసముంటున్నాం. గతంలో సక్రమంగా సరఫరా అవుతుండడంతో ఇక్కడే స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నాం. ప్రస్తుతం తక్కువ సమయం నీటిని సరఫరా చేస్తున్నారు. మరో గంట సమయం ఎక్కువగా వదిలితే బాగుంటుంది.

- ఒక్కంటి స్వాతి, స్థానికురాలు

పర్యవేక్షిస్తాం

ఈ విషయంపై జలమండలి అధికారి అశోక్‌ను వివరణ కోరగా... 2016లో గోదావరి జలాలు ప్రారంభమైన సమయంలో ఇక్కడి రిజర్వాయర్‌కు కేటాయించిన నీటినే ఇప్పుడూ వదులుతున్నారు. కానీ అప్పట్లో 42 వేల కనెక్షన్లు ఉండగా, విస్తరించిన కాలనీలతో 80 వేలకు పైగా వచ్చాయి. దీంతో నీటి సరఫరా కొంత తక్కువగా అవుతోంది. సమస్యలున్న పద్మానగర్ ఫేజ్-1, ఇతర కాలనీలను గుర్తించి పైప్‌లైన్లకు వాల్వ్‌లు ఏర్పాటు చేయించి సమస్య ఉన్న కాలనీలకు నీటిని సరఫరా చేసేందుకు కృషి చేస్తాం. అధికారులతో పర్యవేక్షించి నీటి సరఫరా సరిగా అయ్యేలా చేస్తాం.

- అశోక్, జలమండలి అధికారి

నిజాంపేట్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

● రూ.9 కోట్లతో పనులకు ఏర్పాటు

నిజాంపేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : నిజాంపేట్ కార్పొరేషన్‌లో సోమవారం అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య నినాదాలతో వివాదం చోటు చేసుకుంది. కార్పొరేషన్‌లోని ఆరు ప్రాంతాల్లో దాదాపు రూ.9 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. అధికార పార్టీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, మేయర్ నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు శంకుస్థాపనను కొనసాగించారు. ఆరు ప్రాంతాల్లో చేపట్టిన శంకుస్థాపనలో మేయర్, మహేందర్‌రెడ్డి, కార్పొరేటర్లతో కలిసి కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. అయిదారు ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హాజరయ్యారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి రాకతో కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా నినాదాలు చేశారు. అప్పటి వరకు వేచి చూస్తున్న డిప్యూటీ మేయర్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్ బాలాజీనాయక్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే రాకతో మరింత రెచ్చిపోయి బీఆర్ఎస్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ప్రగతినగర్ వద్ద జరిగిన శంకుస్థాపనలో ఇరు పార్టీల మధ్య నినాదాలు జోరందుకున్నాయి. ఒకరిపై ఒకరు దౌర్జన్యం చేసుకునే పరిస్థితులు ఏర్పడి, తోపులాటలు జరిగాయి. ఈ క్రమంలో బాచుపల్లి పోలీసులు కలుగజేసుకొని ఇరు వర్గాలను అదుపు చేస్తూ, చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఇంత జరుగుతున్నా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మాత్రం చేయి చేయి కలుపుకుంటూ అభివృద్ధి పనులను ముగించుకొని వెళ్లిపోయారు.


నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

పేట్‌బషీరాబాద్, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : జీడిమెట్ల డివిజన్‌లోని వెంకటేశ్వర కాలనీ వెస్ట్ నూతన కార్యవర్గ సభ్యులు పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసి కాలనీ సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. గాజులరామారం డివిజన్‌లోని మోట్కానిగూడ అయ్యప్ప కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, సమస్యలను వివరించారు. అలాగే జీడిమెట్ల గ్రామంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయకమిటీ, శ్రీ విశ్వకర్మ సొసైటీ సభ్యులు రూపొందించిన నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

ప్రజావాణిలో ఫిర్యాదులు



అధికారులతో చర్చిస్తున్న డీసీ మల్లారెడ్డి

కుత్బుల్లాపూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో సమస్యలను పరిష్కరించాలని తొమ్మిదిమంది దరఖాస్తు చేసినట్లు ఉప కమిషనర్ మల్లారెడ్డి తెలిపారు టౌన్ ప్లానింగ్‌కు 4, ఇంజనీరింగ్ విభాగానికి 3, విద్యుత్, వెటర్నరీ విభాగాలకు ఒక్కో దరఖాస్తు వచ్చిందన్నారు. దరఖాస్తులను పరిశీలించి త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ఆయా విభాగాల అధికారులతో దరఖాస్తుల గురించి చర్చించి పరిష్కార మార్గాలను చూపాలని ఆదేశించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చెత్తను తొలగించిన అధికారులు

పేట్‌బషీరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇంకా ఎన్ని రోజులకు చెత్తను తొలగిస్తారని 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి జీడిమెట్ల ఐలా అధికారులు స్పందించారు. సోమవారం రంగారెడ్డినగర్ డివిజన్‌లోని గుబురుగుట్ట నుంచి గాంధీనగర్‌కు వెళ్ళే ప్రధాన రహదారిలో చెత్త తొలగించారు. దీంతో స్థానికులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలియజేశారు.


చెత్తను తొలగించిన తర్వాత రోడ్డు

ఆహ్వానం



భారత రాజ్యాంగ పరిరక్షణ సభకు ముఖ్య అతిథులుగా పాల్గొనాలని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ చీఫ్ విప్ పట్నం మహేంద్రరెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డిలను జైబీమ్ మహాసేన మానవహక్కుల సంరక్షణ సంఘం సభ్యులు సోమవారం కలిసి వారికి ఆహ్వాన పత్రాలను అందజేశారు. - నిజాంపేట్, (ఆంధ్రజ్యోతి)



పలు శాఖల అధికారులతో సమావేశంలో మాట్లాడు తున్న కమిషనర్ సత్యనారాయణ

నేటి నుంచి లబ్దిదారుల ఎంపిక

దుండిగల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి దుండిగల్ మున్సిపల్ పరిధిలోని 28 వార్డుల్లో షెడ్యూలు ప్రకారం 21వ తేదీ నుంచి 2 వరకు సభలను నిర్వహించడం జరుగుతుందని కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. ఈ విషయమై మున్సిపల్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించి, గ్రామ సభల విధి, విధానాలపై అధికారులు సూచనలు చేశారు. ఈ వార్డు సభలకు సంబంధించిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే, రేషన్ కార్డుల సర్వే, రైతు బరోసా, ఆత్మీయ బరోసాకు అప్లి కేషన్‌లు వెల్ళేచెయ్యడం జరుగుతుందని తెలిపారు. ఈ వార్డుల సభలో ఇందిరమ్మ కమిటీల ద్వారా అర్హులైన వారి వివరాలను తీసుకోవాడం జరుగుతుందన్నారు. కాబట్టి పేద ప్రజలందరూ గ్రామ సభల్లో పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వార్డు సభలను సద్వినియోగం చేసుకోవాలి

● కమిషనర్ శ్రీహరి

పేట్‌బషీరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కొంపల్లి మున్సిపల్ పరిధిలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు ప్రతీ వార్డులో నూతన రేషన్ కార్డులకు సంబంధించి వార్డు సభలు నిర్వహిస్తారని కమిషనర్ శ్రీహరి తెలిపారు. మున్సిపల్‌లోని 18 వార్డుల్లో నిర్వహించే సభలకు ఒక వార్డు ఆఫీసర్, వార్డులో నియమించిన వార్డు అధికారి, వార్డు కౌన్సిలర్, కమిటీ సభ్యులతో సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు గాంధీనగర్ మహిళాభవన్, ఎస్వీ ఫంక్షన్ హాల్, పోచమ్మ టెంపుల్, 2 గంటల నుంచి 5 గంటల వరకు మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్, సాయికృష్ణా అపార్టుమెంట్స్ అసోసియేషన్ బిల్డింగ్, సిద్ధార్థ అసోసియేషన్ బిల్డింగ్ వద్ద నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాజులరామారం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలోని శంషీగూడ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు మహదేవపురం, బాలయ్య బస్తీ, షిరిడిహిల్స్, కైలాస్ హిల్స్, ప్రాగా టూల్స్, నందిన హిల్స్, మహదేవపురం వార్డు ఆఫీసులైన్‌లో విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు ఏఈ చైతన్య భార్గవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

సమస్యలు పరిష్కరిస్తా



పాదయాత్ర చేస్తున్న కాలనీ వాసులు, జేకే శేఖర్‌యాదవ్

జీడిమెట్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జెకె శేఖర్‌యాదవ్ జగద్గిరినగర్ బస్తీలో స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా నిత్యం ఈ ప్రాంతంలో మురుగు నీరు, రహదారిపై పారుతోందని, చేతి పంపు, బస్టాప్‌లో బోరు మోటర్ చెడిపోయిందని ఆయన దృష్టికి స్థానికులు తీసుకువచ్చారు. త్వరలోనే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని వారికి ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షులు జగన్‌ముదిరాజ్, ముత్యాలు, సత్తిరెడ్డి, వెంకటేష్, శివరెడ్డి, భిక్షపతి, రాజు,రవి, మరి కొంత మంది పాల్గొన్నారు.


అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రాష్ట్ర గిరిజన శక్తి సంఘం సభ్యులు

కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలి

దుండిగల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గండిమైసమ్మ, దుండిగల్ మండల పరిధి, గాగిళ్లాపూర్ సర్వే నంబరు 204, 213ల్లో ప్రణీత్, ప్రణవ్ గ్రోవ్ పార్కు వెంచర్ పది ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి విల్లాలు నిర్మించారు. దీనిపై విచారణ జరిపి, కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర గిరిజన శక్తి కమిటీ సభ్యులు సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తూ, వినతి పత్రం సమర్పించారు. ఈ విషయమై దుండిగల్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసి సంవత్సరం గడిచిందని, ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి నిర్లక్ష్యం వహించిన తహసీల్దార్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో గిరిజన శక్తి రాష్ట్ర అధ్య క్షుడు కుర్రా శరత్‌నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుబేందర్‌సింగ్, కార్యకర్తలు ఉన్నారు.


అమ్మవారు ఆవహించి భవిష్యవాణిని వినిపిస్తున్న రాజేష్

నమ్మి కొలిచిన వారికి కష్టాలు రానివ్వను

● భవిష్యవాణిలో రాజేష్

షాపూర్‌నగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): చిత్తారమ్మ జాతరలో భాగంగా సోమవారం ఆలయ కమిటీ నిర్వహించిన రంగం(భవిష్యవాణి) కార్యక్రమంలో అమ్మవారు భవిష్యవాణి వినిపించారు. నా దగ్గరకు వచ్చే భక్తులను ఎల్లవేళలా కాపాడుకుంటానని, నమ్మి కొలిచిన వారిని కొంగుబంగారంలా కాచుకుంటానన్నారు. గుడి పరిసర ప్రాంతాల్లో నిర్మాణాలు రావడంతో కుంచించుకుపోతుందని చెప్పారు. ఈ సంవత్సరం వర్షాలు బాగా పడతాయని, పంటలు పండి రైతులు సుఖసంతోషాలతో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి ఆర్. బాల్‌రాజ్, డైరెక్టర్‌లు ఆర్.నర్సింహ, ఎం. పెంటారెడ్డి, క్రిష్టారెడ్డి, సత్తెయ్య, నర్సింహ, ముఖ్య సలహాదారులు కూన శ్రీనివాస్‌గౌడ్, పి. శంకర్‌రెడ్డి, డి. ఇంద్రసేనారెడ్డి, ఏ. ఇంద్రసేనా గుప్త, భక్తులు పాల్గొన్నారు.


సమస్యలను తెలుసుకొంటున్న భరత్‌సింహారెడ్డి

తాగునీటి సమస్య తీర్చండి

పేట్‌బషీరాబాద్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్‌లోని గాయిత్రినగర్ ఎంఎల్ఎన్ రెసిడెన్సీలో జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో బీజేపీ మేడ్చల్ అర్బన్‌జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్‌సింహారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో పెండింగ్ పనులు, మంచినీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం అక్కడే ఉన్న అధికారులతో త్వరగా సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సత్యన్నారాయణరెడ్డి, రాము, అంజేయులు, శ్రీనివాస్ రెడ్డి, సందీప్‌గౌడ్, అధికారులు పాల్గొన్నారు.


చివరి సమావేశం అనంతరం సభ్యులతో గ్రూప్ ఫొటో

మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా పని చేశా

దుండిగల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో దుండిగల్ మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా పని చేశామని మున్సిపల్ చైర్‌పర్సన్ సుంకరి కృష్ణవేణి అన్నారు. మున్సిపల్ సమావేశ మందిరంలో సోమవారం చివరి సాధారణ సర్వసభ్య సమావేశం కృష్ణవేణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సభ్యులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ శంభీపూర్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కౌన్సిల్ సభ్యుల సహకారంతో మున్సిపల్ ప్రజల మన్ననలు పొందామన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా శక్తి వంచన లేకుండా అభివృద్ధి పనులు కొనసాగించామని తెలిపారు. మరో ఐదు రోజులు పదవీకాలం ఉండగానే అందరికీ ఆమె వీడ్కోలు పలికారు. ఈ సమావేశంలో కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణ, తహసీల్దార్ మతిన్, మున్సిపల్ మేనేజర్, ఏఈలు, ఇరిగేషన్, రెవెన్యూ, సిబ్బంది ఉన్నారు. ఈ సందర్భంగా అధికారులు, సభ్యులు చైర్‌పర్సన్‌ను ఘనంగా సన్మానించారు.

నర్సరీ పేరుతో ప్రభుత్వ స్థలం ఆక్రమణ

పేట్‌బషీరాబాద్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్, హెచ్ఎండీఏ, హైడ్రా అధికారులకు మేడ్చల్ మల్కాజ్‌గిరి కాంగ్రెస్ లేబర్ సెల్ అధ్యక్షుడు కె. సుదర్శన్‌రెడ్డి వినతి పత్రాన్ని అందజేశారు. జీడిమెట్ల డివిజన్‌లోని పేట్‌బషీరాబాద్ సర్వే నంబర్ 25/1లో మూడు ఎకరాల ఐదు గుంటల ప్రభుత్వ స్థలాన్ని నర్సరీ పేరుతో ఆక్రమించి 59జీవో ద్వారా రెగ్యులైజ్‌కు అర్జి పెట్టుకోవడం గమనార్హం. గత సంవత్సరం జులై 24న కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు కూల్చివేసినా మరలా నిర్మాణం చేపట్టారన్నారు. అధికారులు పట్టించుకోపోవడంతో పైఅధికారులకు ఫిర్యాదు చేసినట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రస్తుతం రెవెన్యూ విభాగం ఆక్రమించుకొన్న స్థలాన్ని కాపాడడంలో విఫలం అవుతున్నారని, అధికారులు స్పందించి స్థలాన్ని కాపాడాలని కోరారు.


తవ్వి వదిలేసిన గుంత


వాల్వ్ వద్ద చేరిన మురుగునీరు

కలుషితమవుతున్న తాగునీరు

కుత్బుల్లాపూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి చెరుకుపల్లి కాలనీ రోడ్ నంబర్ -17 వద్ద తాగునీటి పైప్‌లైన్ వాల్వ్ వద్ద లీకేజీ అవుతుండటంతో స్థానికులు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు మరమ్మతుల కోసం వాల్వ్ వద్ద తవ్వించి వదిలేశారు. దీంతో గుంతలో నీరు నిలిచి వాల్వ్ ద్వారా కలుషితమయ్యే అవకాశముందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే మరమ్మతులు చేయించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి


మృతుడు సిద్ధార్థ వర్మ

దుండిగల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లంపేట్‌లో సోమవారం నాడు జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధార్థవర్మ(31) అనే వ్యక్తి బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి భవన నిర్మాణ కార్మికునిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం సాయంత్రం మల్లంపేట ఆకావ లేవుట్ రోడ్ నంబరు 3లో నిర్మిస్తున్న భవనం వద్ద పనిచేస్తున్నాడు. ఇంటి మొదటి ఫ్లోర్‌లో సెంట్రింగ్ రాడ్ కట్టడానికి రాడ్డును పైకి ఎత్తాడు. రోడ్డును ఆనుకుని ఉన్న విద్యుత్ వైర్లకు సెంట్రింగ్ రాడ్డు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై పడిపోయాడు.

స్థానికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు. దర్యాప్తు చేస్తున్నారు.

దంపతుల ఘర్షణ.. పురుగుల మందు తాగి భర్త ఆత్మహత్య

దుండిగల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : భార్యాభర్తల గొడవ ఒకరి ఆత్మహత్యకు దారితీసింది. దుండిగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా, గోవిందరావుపేట మండలం, కరుపల్లి తండాకు చెందిన భానోత్ తిరుపతి(30) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చాడు. గండిమైసమ్మ నిరంజన్ కాలనీలో నివసిస్తూ అక్కడే వాచ్‌మన్‌గా ఏడాది నుంచి పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం భార్యాభర్తలు గొడవపడ్డారు. మనస్తాపం చెందిన తిరుపతి గండిమైసమ్మ చౌరస్తాకు వెళ్లి ఓ షాపులో పురుగుల మందు కొనుక్కొని తాగుతూ.. భార్యకు వీడియో కాల్ చేసి తాను చనిపోతున్నానని చెప్పాడు. భార్య శారద వెంటనే గండిమైసమ్మ చౌరస్తాకు వెళ్లగా తిరుపతి బావర్చి హోటల్ పక్కన ఖాళీ ప్రదేశంలో చనిపోయి ఉన్నాడు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దంపతులు ఎందుకు గొడవపడ్డారనే విషయం తెలియరాలేదు.